క్లుప్తంగా

కోర్టులో మీడియేషన్ సెంటర్ ప్రారంభం



కైకలూరు: స్థానిక కోర్టులో మీడియేషన్ సెంటర్‌ను సీనియర్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జీలు వీవీఎన్‌వీ లక్ష్మీ, ఎం.శివకిరణ్ శుక్రవారం ప్రారంభించారు. జడ్జిలు మాట్లాడుతూ మీడియేషన్ సెంటర్‌లో కక్షిదారులు త్వరితిగతిన కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అంశంపై ఇటీవల శిక్షణ పొందిన న్యాయవాదులు ఎం.సత్యనారాయణ, కె.కోటయ్య, ఎం.శివప్రసాద్ మీడియేటర్లుగా వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా మీడియేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి, విధి విధానాలపై చర్చించారు. కార్యక్రమంలో న్యాయవాదులు టి.శ్రీనివాసరావు, వి. శ్రీరామచంద్రమూర్తి, పి.పవన్ కాంత్, ఎ.రాంబాబు, ఎంఎస్ఎస్. రాజు, కె.రమాదేవి, ఎండీ రజిమున్నిసా తదితరులు పాల్గొన్నారు

సీసీ రోడ్లు ప్రారంభం



గుడ్లవల్లేరు: వడ్లమన్నాడులో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, పోలవరపు వెంకట్రావు, మాజీ సర్పంచ్ కొడాలి రామరాజు, సర్పంచ్‌లు కాగిత నరేంద్ర, పామర్తి భాస్కరరావు, ఈడె మోహన్, పెన్నేరు రమేష్, వడ్లమన్నాడు సర్పంచ్ కటికల జ్యోతిలత, ఉప సర్పంచి గరికపాటి రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ బహూకరణ



గుడ్లవల్లేరు: మండలంలోని పెంజెంద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి తప్పిట ఈశ్వరరావు రూ.5వేల విలువైన స్పోర్ట్స్ కిట్‌ను విద్యార్థులకు శుక్రవారం బహూకరించారు. విద్యార్థులకు తనవంతుగా ఈ కిట్‌ను అందించాలని కోరుతూ హెచ్ఎం పాఠశాల కె.నాగబాబుకు పాఠశాల స్టాఫ్, పిల్లల సమక్షంలో అందజేశారు. దాత ఈశ్వరరావుకు పాఠశాల తరఫున హెచ్ఎం, పాఠశాల స్టాఫ్, పిల్లలు తమ హృదయ పూర్వక కృతజ్ఞతలను తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



పమిడిముక్కల: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. వేల్పూరు వద్ద డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనను శుక్రవారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ దిలీప్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణకుమారి, వైస్ ఎంపీపీ మహేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

20న కావిడి మహోత్సవం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20న ఆడికృత్తిక కావిడి సేవ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆలయంలో ఆడి కృత్తిక సందర్భంగా ప్రథమంగా 58 కావిళ్లతో కావిడి సేవ ఉత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవలో పాల్గొనే భక్తులు రూ.558 చెల్లిస్తే ఆలయం తరఫున కావిడి సమకూరుస్తామని తెలిపారు.

జలదుర్గామాతకు ఆషాఢ సారె



పెద్దింట్లమ్మ దేవస్థానంలో సారె సమర్పిస్తున్న కొల్లేరు గ్రామాల మహిళలు

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో పార్వతీదేవీ ప్రతిరూపమైన జలదుర్గాదేవికి కొల్లేరు గ్రామాల మహిళలు శుక్రవారం ఆషాఢ సారెను సమర్పించారు. పసుపు, కుంకుమ, పూలు, వస్త్రాలు, వివిధ రకాల పిండి వంటలను నైవేద్యంగా అందించారు. ఆలయానికి విచ్చేసిన మహిళలకు ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ స్వాగతం పలికారు. అనంతరం మహిళలందరూ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పార్వతీమాతకు..

శ్యామలాంబ దేవస్థానంలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీమాతకు వెలంపేట మహిళలు శుక్రవారం ఆషాఢ సారెను సమర్పించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మవారి దేవస్థానం వద్దకు చేరుకున్నారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ మహిళా భక్తులకు స్వాగతం పలికారు.



శ్యామలాంబ దేవస్థానంలో మేళతాళాలతో సారె సమర్పించడానికి వస్తున్న వెలంపేట మహిళలు

పామర్రులో..

పామర్రు: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక రామలింగేశ్వరస్వామి సమేత పర్వతవర్ధనీ దేవికి భక్తులు సారెను శుక్రవారం సమర్పించారు. తొలుత సారెను గాంధీ నగరంలోని పురవీధుల వెంబడి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ నిర్వాహకురాలు రాధమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

శాకంబరేశ్వరిగా అమ్మవారు

గుడివాడ టౌన్: స్థానిక నాగవరప్పాడులో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారిని శుక్రవారం శాకంబరేశ్వరి దేవిగా అలంకరించారు. ఆషాఢ మాసం మహిళలకు ఎంతో ప్రాధాన్యమైనదని, దీనిని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు.



పామర్రులో అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పిస్తున్న భక్తులు

హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కిందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ అనే కార్యక్రమంపై శనివారం స్థానిక లింగవరం రోడ్డులోని కె. కన్వెన్షన్‌లో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) తో పాటు పార్లమెంట్ నియోజకవర్గం లోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొంటారని పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గంలోని నందివాడ, గుడ్లవల్లేరు, అర్బన్, రూరల్ మండలాల అన్ని విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, ఎంపీపీ పెయ్యల ఆదాము, నాయకులు పాలేటి చంటి, కె.ఆంజనేయ ప్రసాదు, అడపా పండు, చుండూరి శేఖర్, సీహెచ్ నాగూర్ పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై సమావేశం

గుడ్లవల్లేరు: గుడివాడలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీపై సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు గుదే రవి విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుడివాడ లింగవరం రోడ్డులోని కె-కన్వెన్షన్ హాల్లో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని)తో పాటు ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని తదితరులు విచ్చేయనున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

కలిదిండి(కైకలూరు): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని కలిదిండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీ చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.జాహ్నవి మాట్లాడుతూ ప్రణాళికబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణ మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం' అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. సీహెచ్ఓ కృష్ణకిషోర్, పీహెచ్ఎన్.నాగమణి, హెల్త్ విజిటర్ బి.ధనలక్ష్మీ పాల్గొన్నారు.



కలిదిండిలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాలి

ముదినేపల్లి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గురజ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి ప్రభుత్వం అందిస్తోన్న పౌష్టికాహారం సక్రమంగా వినియోగించేలా చూడాలన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ రాచూరి రాధా, వైఎస్సార్ సీపీ నాయకులు రాచూరి కుమార్, మోట్రు ఏసుబాబు, బత్తిన కిషోర్, మీసాల రామకృష్ణ, మామిడిపల్లి రంగారావు, పుట్టి సుబ్బారావు, రాచూరి గణేష్ తదితరులు ఉన్నారు.



గురజ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ

కచ్చా డ్రెయిన్లలో పూడికతీత

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో కచ్చా డ్రెయిన్ల పూడికతీత పనులు చేస్తున్నారు. కాలనీలోని అన్ని కచ్చా డ్రెయిన్లలో పేరుకుపోయిన మట్టిని జేసీబీతో రెండు రోజులుగా తొలగిస్తున్నారు. ఈ డ్రెయిన్లు పూర్తిగా పూడుకుపోవడంతో వర్షపు నీరు పారే దారి లేక కాలనీలోని రోడ్లపైకి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితి ఉండడంతో ఈ పనులు చేపట్టారు. పనులను సర్పంచ్ మంచాల సరస్వతీ, కార్యదర్శి హారిక పర్యవేక్షిస్తున్నారు.

తాగునీటి క్లోరినేషన్ పరీక్షలు

గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడులోని రక్షిత మంచినీటి పథకం వద్ద తాగునీటిలో క్లోరినేషన్ ఎంతమేరకు ఉందనే విషయమై ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ శుక్రవారం పరీక్షలు చేయించారు. సచివాలయ సిబ్బంది, పారిశుధ్య, తాగునీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

దత్తత కుటుంబాలపై ఆరా

గుడ్లవల్లేరు: పీ4 కింద దత్తత తీసుకోవటమే కాకుండా తీసుకోవాల్సిన కుటుంబాలపై ఆరా తీసేందుకు ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో పీ4 మార్గదర్శి - బంగారు కుటుంబంపై సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో అధికారులు ఆయా కుటుంబాలను పర్సనల్‌గా వెళ్లి కలసి వారికి ఎటువంటి తోడ్పాటు కావాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరి

విజయవాడ కల్చరల్: సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్, కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం సౌజన్యంతో సంగీత వాగ్గేయకారుడు మల్లాది సూరిబాబు 80 జన్మదిన వేడుకల సందర్భంగా లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాస్త్రీయ సంగీత కచేరీలు సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో చెన్నైకి చెందిన యువ సంగీత కళాకారుడు ధూళిపాళ్ళ సాయి దీక్షిత్ రెండు గంటల పాటు వాగ్గేయకార కీర్తనలను అలవోకగా ఆలపించారు. శివనంద యశ్వి మృదంగంపై శ్రీరంజనీ వైష్ణవీ వాద్య సహకారం అందించారు.

సంక్షిప్తం

• కోసూరు కార్యదర్శిగా శ్రీలక్ష్మీకృష్ణవేణి

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు పంచాయతీ కార్యదర్శిగా నెమలికంటి శ్రీ లక్ష్మీ కృష్ణవేణి బాధ్యతలు శుక్రవారం చేపట్టారు. ఆమె ఘంటసాల మండలంలోని చిట్టూర్పు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై కోసూరుకు విచ్చేశారు.

• పాల కేంద్ర కమిటీ ప్రమాణ స్వీకారం

గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడు పాల కేంద్రం నూతన కమిటీ ఇటీవల ఎన్నికైంది. ఆ కమిటీ ప్రమాణ స్వీకారాన్ని శుక్రవారం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడు పుల్లేటి రాజాప్రసాద్, కమిటీ సభ్యులను గుడివాడ ఎమ్మెల్యే రాము అభినందించారు.

• శావ్యానాయక్‌కు సత్కారం

ముదినేపల్లి రూరల్: ఎంఈఓగా మండలానికి విశేష సేవలందించిన శావ్యానాయక్ సేవలు మరువలేనివని ఉపాధ్యాయ సంఘాల నేతలు అన్నారు. మండలంలో ఎంఈఓగా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన శావ్యానాయక్, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులును పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో శుక్రవారం ఘనంగా సత్కరించారు.

• పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు

మండవల్లి: మొఖాసాకలవపూడి పీఏసీఎస్ చైర్మన్‌గా అట్లూరి వెంకటేశ్వరరావు శుక్రవారం ఎంపికయ్యారు. డైరెక్టర్లుగా కూనపురెడ్డి శ్రీనివాసరావు, వరద శివనాగేశ్వరరావు ఎంపికయ్యారు. నీటిసంఘం అధ్యక్షుడు కె.బాలకోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఎస్.అప్పారావు, కె.కృష్ణ, ప్రసన్నాంజనేయులు, శ్రీనివాసరావు చైర్మన్‌ను అభినందించారు.

• టైలరింగ్ కేంద్రం పరిశీలన

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి నాట్యానికి వినియోగించేందుకు స్థానిక డ్వాక్రా మహిళలు కుట్టిన నృత్య డ్రస్ (దుస్తులు)లను శుక్రవారం ఎంపీడీఓ డి.సుహాసిని పరిశీలించారు. కూచిపూడి సెంటర్లో కొనసాగుతున్న టైలరింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. మండలంలోని 20 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్న ట్రైనర్ రమ్యా ద్వారా వివరాలు సేకరించారు. శిక్షణ పొందుతున్న డ్వాక్రా మహిళలకు ఉయ్యూరు విశ్వశాంతి తో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫాం కుట్టడానికి అవకాశం కల్పిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

'స్మార్ట్ మీటర్లు మాకొద్దు'

గుడివాడ టౌన్: స్మార్ట్ మీటర్లు ఏర్పాటు మానుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. స్థానిక జగనన్న కాలనీలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను నాయకులు అడ్డుకున్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా అదాని మీటర్లు వ్యతిరేకించిన టీడీపీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని ప్రోత్సహించడం దారుణమన్నారు. ప్రజల సొమ్మును అడ్డగోలుగా దోచుకునే అదాని కంపెనీకి విద్యుత్ శాఖను తాకట్టు పెట్టారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి స్మార్ట్ మీటర్లు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రజిని, ఎల్. సురేంద్ర, ఆర్. కొండ, బండి శ్రీను, ఎస్. వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పామర్రు: శేషులు ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ అండ్ కేర్ ట్రస్టు ద్వారా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేయటం అభినందనీయమని ఎస్‌కేఆర్ ఆర్ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో మండలంలోని ఏడు జెడ్పీ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం ట్రస్టు నిర్వాహకులు అందజేశారు. అనంతరం ట్రస్టు నిర్వాహకులు కాకర్ల విజయమాధురి, కోనేరు మాధవి, మొవ్వ రాధిక మాట్లాడుతూ ప్రతి హైస్కూల్లో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.25వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.18వేలు, 9వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.12 వేలు, స్పోర్ట్సులో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.15వేలు చొప్పున అందజేసినట్లు పేర్కొన్నారు. ఒక్కో హైస్కూల్‌కు రూ.70వేలు చొప్పున మండలంలోని ఏడు జెడ్పీ పాఠశాలలకు రూ.4.90 లక్షల ప్రోత్సాహకాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కాకర్ల బలరామమూర్తి, కాకర్ల శివయ్య పాల్గొన్నారు.



ట్రస్టు నిర్వాహకులు ఇచ్చిన నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

నేటి పోటీతత్వమే.. రేపటి విజయానికి మెట్లు

గుడ్లవల్లేరు: విద్యార్థుల్లో నేటి పోటీతత్వమే రేపటి విజయానికి మెట్లు అని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. పాపులేషన్ ఎడ్యుకేషన్ డైట్‌కు సంబంధించి అంగలూరు ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో పెయింటింగ్, వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్స్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అందజేశారు. పెయింటింగ్‌లో బంటుమిల్లి మండలం పెద తుమ్మిడి జెడ్పీహెచ్ఎస్ ప్రథమం, మోపిదేవి మండలం మోపిదేవి జెడ్పీహెచ్ఎస్ ద్వితీయం, వ్యాసరచన పోటీల్లో గుడ్లవల్లేరు మండలం కౌతవరం జెడ్పీహెచ్ఎస్ ప్రథమం, వడ్లమన్నాడు జెడ్పీహెచ్ఎస్ ద్వితీయం, గుడివాడ మాంటిస్సోరీ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా రాజ్యలక్ష్మి, శివపార్వతి, న్యాయనిర్ణేతలుగా మోహినికుమారి, పి.వినీ వ్యవహరించారు.



విజేతలకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ

తాగునీటి బోరు పనులు ప్రారంభం

పమిడిముక్కల: మండలంలోని తాడంకిలో నూతన బోరు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండల పరిషత్ నిధులు రూ.3 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పనులకు శ్రీకారం చుట్టారు. పాత బోరు పనిచేయకపోవడంతో కొత్తది ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ జంపాన ధనలక్ష్మి తెలిపారు. చర్చి, టవర్ బజారుల్లో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. మూడు రోజుల్లో బోరు అందుబాటులోకి వస్తుందని, ప్రజలు సహకరించాలని కోరారు. బోరు పనులను జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు కూచిపూడి శ్రీలక్ష్మి, కార్యదర్శి భవాని, మాజీ సర్పంచ్ జక్కా శ్రీనివాసరావు పరిశీలించారు.



బోరు పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రమణకుమారి, సర్పంచ్ ధనలక్ష్మి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: పట్టణంలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నందివాడలో ..

నందివాడలోని 33 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మండలంలోని నందివాడ, శ్రీనివాసపురం, తుమ్మలపల్లి, వెన్ననపూడి, తమిరిశ, అరిపిరాల, జనార్దనపురంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని చిగురుకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ డివిజన్ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరరావు తెలిపారు.

కైకలూరులో..

కైకలూరు: మండలంలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు కొంత సమయం అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉండదని పేర్కొన్నారు.